వాయిస్ టుడే

హైదరాబాద్
శుక్రవారం, 26 జూలై 2024



## స్థానిక సమస్యల పరిష్కారం కోసం బిజెపి ఆద్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వంపై నిరంతర పోరాటం

### బిజెపి మండల కార్యవర్గ సమావేశంలో అధ్యక్షుడు ఏనుగుల అనీల్

కరీంనగర్ జులై 25(వాయిస్ టుడే )భారతీయ జనతా పార్టీ శంకరపట్నం మండల కార్యవర్గ సమావేశం స్థానిక లక్ష్మీ ప్రసన్న గార్డెన్లో పార్టీ అధ్యక్షుడు ఎనుగుల అనిల్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా పార్టీ జెండా ఆవిష్కరించి అనంతరం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అనీల్ మాట్లాడుతూ ముందుగా ఇటివల జరిగిన పార్లమెంటు ఎన్నికలలో పార్టీకి మండలం నుండి అత్యధిక ఓట్లు వేసి గెలిపించిన మండల ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇస్తానన్న హామీలను నామమాత్రంగా అమలు పరుస్తూ ప్రజలను మోసం చేస్తుందని ప్రభుత్వ పథకాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందే వరకు బిజెపి నిరంతర పోరాటం చేస్తుందని పేర్కొన్నాడు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా కార్యదర్శి చెన్నమాదవుని నరసింహరాజు మాట్లాడుతూ... మోడీ విజయం కోసం బూత్ స్థాయిలో ఏ విధంగా అయితే కష్టపడ్డారో రాబోయే స్థానిక ఎన్నికలలో మెజారిటీ స్థానాలు కైవసం చేసుకొనుటకు సిద్దం కావాలని, ఇతర పార్టీల విమర్శలను కార్యకర్తలు తప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పలు స్థానిక సమస్యలపై తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దండు కొమురయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## హుజురాబాద్ ఏసీపీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి

కరీంనగర్ జులై 25(వాయిస్ టుడే )కరీంనగర్ కమీషనరేట్ పరిధిలోని హుజురాబాద్ ఏసీపీ కార్యాలయాన్ని గురువారంనాడు కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి, ఐపీఎస్. వార్షిక తనిఖీల్లో భాగంగా ఏసీపీ కార్యాలయాన్ని తనిఖీ చేసారు. ఏసీపీ కార్యాలయంలో గల పెండింగ్ కేసులపై సమీక్షించారు వాటికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన వాటిని పూర్తి చేయాలనీ సూచించారు.విసిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రౌడీ షీటర్లు , హిస్టరీ షీటర్ల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ప్రతి నెల వారికి సంబందించిన నూతన సమాచారం ఎప్పటికప్పుడు సేకరించి నమోదు చేసుకోవాలన్నారు. దేశ వ్యాప్తంగా ప్రవేశపెట్టబడిన నూతన చట్టాల అమలు జరిగేలా చూడాలన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా డివిజన్ పరిధి పోలీస్ స్టేషన్ లోని అధికారుల ద్వారా ప్రజల్లో అవగాహనా పెంచాలన్నారు. పెండింగ్ వారెంట్ల అమలు చేయాలన్నారు. అక్రమ ఇసుక రవాణా , పి డి ఎస్ బియ్యం , పేకాట స్థావరాలను గుర్తించి ఆడేవారిని పట్టుకోవడం మొదలగు వాటిపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఈ కార్యక్రమం లో హుజురాబాద్ ఏసీపీ శ్రీనివాస్ జి ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## విద్యార్థులకు ఏ ఇబ్బంది రావద్దు..

### అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి..

### ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలి..

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ జులై 25(వాయిస్ టుడే )వసతి గృహంలో విద్యార్థులు ఏ ఒక్కరు ఇబ్బంది పడకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. గురువారం రాత్రి కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామంలోని ప్రభుత్వ బాలుర ఎస్సీ వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. అధికారుల నుంచి వసతి గృహ నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. రీడింగ్ రూమ్ వంటగది, పడుకునే గది తదితర గదులను పర్యవేక్షించారు. ఎంతమంది విద్యార్థులు ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వసతి గృహంలో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నాణ్యమైన భోజనం పెట్టాలని సూచించారు. ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ప్రభుత్వం వసతి గృహాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు చక్కగా చదువుకునేలా వారిని ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డిడి హమీద్ తో పాటు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# రాజకీయ వైరంతో కాళేశ్వరంపై కుట్రలు

### పంపింగ్ ప్రారంభం కాకపోవడంతో రైతులకు ఇబ్బందులు: కేటీఆర్

### కరీంనగర్‌లోని ఎల్ఎండీ రిజర్వాయర్‌ను సందర్శించిన బిఆర్ఎస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల బృందం



కరీంనగర్ జులై 25(వాయిస్ టుడే )తెలంగాణలో వ్యవసాయ రంగాన్ని ప్రభావితం చేస్తున్న సమస్యలపై ఆందోళన వ్యక్తం చేశారు. నీటి నిర్వహణ, కాళేశ్వరం ప్రాజెక్టుపై కేటీఆర్ పలు విమర్శలు చేశారు. ఏటా వృథాగా పోతున్న వందల టీఎంసీల నీటిని సద్వినియోగం చేసుకునేందుకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారని అన్నారు . కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్రపంచంలోనే అతిపెద్ద బహుళ-దశల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్, ఈ ప్రాజెక్ట్ కారణంగా, తెలంగాణ అతి పెద్ద ధాన్యాగారంగా మారింది. పంజాబ్ మరియు హర్యానాల నీటి సమృద్ధికి పోటీగా వ్యవసాయ విస్తరణ సాధించబడింది. ఈ విజయం ఉన్నప్పటికీ, మేడిగడ్డ వద్ద జరిగిన ఒక చిన్న సంఘటన కాళేశ్వరం విఫలమైన ప్రాజెక్టుగా ముద్ర వేయడానికి అతిశయోక్తి. గత ఎనిమిది నెలలుగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం లక్షలాది మంది రైతుల జీవితాలతో ఆడుకుంటోందన్నారు..గతేడాది ఇదే రోజున ఎల్ఎండీలో 12 టీఎంసీలకు పైగా నీరు ఉండేది. మేము సరైన సమయంలో పంపింగ్ చేయడం ద్వారా ఎల్ ఎం డి యొక్క పూర్తి సామర్థ్యాన్ని నిర్ధారించాము, రైతులకు విశ్వాసం కల్పించాము. ఈ ఏడాది చాలా తక్కువ వర్షపాతం నమోదైంది, అయినప్పటికీ పంపింగ్‌కు సంబంధించి ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. మేడిగడ్డ వద్ద లక్షలాది క్యూసెక్కుల నీరు వృథాగా పోతున్నా ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద నీటి పంపకాలు ప్రారంభించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈ పర్యటనకు శ్రీకారం చుట్టాం. ఎల్ఎండీ, మిడ్ మానేరు, ఎల్లంపల్లి, ఎస్ఆర్ఎస్పీ సహా అన్ని రిజర్వాయర్లను నింపాలని డిమాండ్ చేస్తున్నాం. రాజకీయ కక్షసాధింపుతో పంపింగ్ ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరువాత, ప్రభుత్వం రైతులకు మరియు ప్రజలకు నష్టం కలిగించడానికి తగినంత వర్షపాతం యొక్క సాకును ఉపయోగించుకోవచ్చు. కన్నెపల్లి వద్ద పంపులను యాక్టివేట్ చేస్తే రిజర్వాయర్లన్నీ నిండుతాయి. రిజర్వాయర్లలో మొత్తం 140 టీఎంసీల సామర్థ్యంలో 35 టీఎంసీలు కూడా నిండలేదు. మేడిగడ్డ నుంచి నీటిని విరివిగా పంపింగ్ చేసేందుకు పుష్కలంగా అవకాశం ఉంది. మల్లన్న సాగర్‌లో 50 టీఎంసీలు, కొండపోచమ్మ సాగర్‌లో 15 టీఎంసీలు నింపితే హైదరాబాద్ ప్రజలకు తాగునీటి కష్టాలు తీరుతాయి. అయితే కేసీఆర్ పరువు తీసే కుట్రలో ఈ ప్రయత్నాలు పక్కదారి పడుతున్నాయి. మేడిగడ్డ కొట్టుకుపోతుందని, లక్షల కోట్ల నీరు వృథా అవుతోందని ఎనిమిది నెలలుగా మీరు చేస్తున్న ప్రచారం నిరాధారమని తేలింది. ఎండిపోతున్న రిజర్వాయర్ల పరిస్థితి, రైతుల కష్టాలను ఈ శాసనసభ సమావేశాల దృష్టికి తీసుకెళ్లేందుకు మన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చారు. నీటి పంపకాలను ప్రారంభించనందుకు రైతుల తరపున రాష్ట్ర ప్రభుత్వాన్ని బాధ్యులను చేస్తాం. పది లక్షల క్యూసెక్కుల వరదకు మేడిగడ్డ అండగా నిలిచింది. రాజకీయ లబ్ధి కోసం రైతుల జీవితాలతో ఆడుకోవద్దని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నాను. పరిస్థితులు అనుకూలిస్తే అన్ని బ్యారేజీలను సందర్శిస్తాం. ఎండిపోతున్న రిజర్వాయర్లను, రైతుల పోరాటాలను ప్రభుత్వానికి తెలియజేసేందుకు మీడియా ఈ అంశానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నాను.

## గంజాయి కేసులో నిందుతుడు అరెస్ట్

### 100 గ్రాముల గంజాయి స్వాధీనం.

### కొనరావుపేట్ పోలీస్ స్టేషన్లో ఎస్.ఐ ఆంజనేయులు తో కలసి వివరాలు వెల్లడించిన సి.ఐ వెంకటేశ్వర్లు..




వాయిస్ టుడే ప్రతినిధి సిరిసిల్ల జిల్లా జులై 25:గంజాయి కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు వెల్లడించిన చందుర్తి సిఐ వెంకటేశ్వర్లు.ఈ సందర్భంగా సి.ఐ మాట్లాడుతూ కొనరావుపేట్ మండలం సుద్దాల గ్రామానికి చెందిన వడ్లూరి వెంకటేష్ అనే వ్యక్తి గంజాయి త్రాగడానికి అలవాటు పడి జగిత్యాల జిల్లా కోడిమ్యాల మండలం తిప్పాయిపల్లి,భీంగల్ ప్రాంతాల్లో గుర్తు తెలియని వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేసి ఆ గంజాయి తాగగా మిగిలిన గంజాయి గంజాయి కి అలవాటు పడిన వారికి అమ్ముతుండే వాడు. ఇదే క్రమంలో గురువారం వెంకటేష్ సుద్దాల గ్రామానికి వస్తున్నాడన్న నమ్మదగిన సమాచారం మేరకు గురువారం సుద్దాల గ్రామ శివారులో వెంకటేష్ ని అదుపులోకి తీసుకొని 100 గ్రాముల గంజాయి సీజ్ చేసి రిమాండ్ కి తరలించడం జరిగిందని తెలిపారు.ప్రజలు ఎవరైనా గంజాయి కి సంబంధించిన సమాచారం డయల్100, టాస్కోఫోర్స్ సి.ఐ ఫోన్ నెంబర్ 87126 56392 కి సమాచారం అందించాలని,యువత డ్రగ్స్ భారిన పడి బంగారు భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారని,జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి స్పెషల్ డ్రైవ్ లు నిర్వహించి అక్రమ గంజాయి రవాణాపై జిల్లాలో ప్రత్యేక దృష్టి సారించి ఉక్కుపాదం మోపడం జరుగుతుందన్నారు.

## విరిగిపోయే దశలో ఉన్న విద్యుత్ స్తంభం

### ఎవరికి పొంచి ఉందో ప్రమాదం



వాయిస్ టుడే ప్రతినిధి సిరిసిల్ల జిల్లా జులై 25:రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని డే కేర్ సెంటర్ కు ఎదురుగా గల ఇర్ఫాన్ కిరాణా దుకాణం పక్కన విద్యుత్ స్తంభం పూర్తిగా పెచ్చులు ఊడి ఉంది.ఇట్టి విద్యుత్ స్తంభానికి ఎలాంటి విద్యుత్ కనెక్షన్ కూడా లేదు.వరుసగా కురుస్తున్న ముసురుకు ఇట్టి స్తంభం గాలికి ఊగులాడుతూ ఉంది.నిరుపయోగంగా ఉన్న విద్యుత్ స్తంభం ను ఎవరి మీద పడక ముందే తొలగించి ప్రమాదాన్ని నివారించాలని సెస్ ఏ ఈ పృథ్వి ధర్ ను మాజీ ఎంపిటీసీ ఒగ్గు బాలరాజు యాదవ్ తో పాటు అక్కడి వార్డు ప్రజలు కోరుతున్నారు.

## శ్రీ ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతర మహోత్సవాలు



వాయిస్ టుడే న్యూస్, రాజన్న సిరిసిల్ల జిల్లా: అశాడ మాసం పురస్కరించుకొని వేములవాడ పట్టణంలోని శ్రీ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతర మహోత్సవాలు ఈ నెల 27వ తేదీ నుండి ప్రారంభం కానున్నట్లు ఆలయ ఛైర్మన్ మహంకాళి శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించే బోనాల జాతర మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా మొదటి రోజు శనివారం ఉదయం అమ్మవారికి విశేష అభిషేకములు నిర్వహించనున్నారు. అనంతరం అమ్మవారు శాఖంబరీ అవతారంలో భక్తులకు దర్శనం ఇస్తారని పేర్కోన్నారు.రెండవ రోజు ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మహిళలు అమ్మవారికి భక్తి శ్రద్ధలతో బోనాలు సమర్పిస్తారని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు విజయవాడకు చెందిన ప్రభ బృందం ఆధ్వర్యంలో వైవిధ్యమైన వేషధారణతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. గొర్రె పొట్టేళ్ళు, తొట్టెండ్లు, పలహార బండ్లు, పోతరాజుల విన్యాసాలు, నృత్యాలతో డప్పు వాయిద్యాల మధ్య పట్టణ పురవిధుల గుండా అమ్మవారు ఊరేగింపు ఉంటుందని తెలియజేశారు. చివరి రోజు సోమవారం అమ్మవారికి పుష్పాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి జాతర మహోత్సవాలను ఘనంగా ముగించనున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు కన్నుల పండువగా నిర్వహించే అమ్మవారి బోనాల జాతర మహోత్సవాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదాలు స్వీకరించాలని ఆలయ చైర్మన్ మహంకాళి శ్రీనివాస్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.



## విద్యా రంగాన్ని విస్మరించిన ప్రభుత్వం

### టీపీటీఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దోర్నాల భూపాల్ రెడ్డి, దుమాల రమానాద్ రెడ్డి

వాయిస్ టుడే ప్రతినిధి సిరిసిల్ల జిల్లా జులై 25: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో విద్యారంగానికి అరకొర నిధులు కేటాయించడం అన్యాయం అని టీపీటీఎఫ్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు దోర్నాల భూపాల్ రెడ్డి, దోమల రమనాథ్ రెడ్డి లు అన్నారు. ఈ సందర్భంగా వారు జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొత్తం రూ:2 లక్షల 91 వేల 191 కోట్ల బడ్జెట్ లో విద్యారంగానికి రూ 21 వేల 292 కోట్లతో 7.31 శాతం నిధులు మాత్రమే కేటాయించడం సరైంది కాదన్నారు.విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని ప్రగల్భాలు పలికిన ప్రభుత్వం చేతలలో మాత్రం విఫలం చెందింది అని,నిజానికి కొఠారి కమిషన్ సిఫార్సుల ప్రకారం మొత్తం బడ్జెట్ లో కనీసం 20 శాతం నిధులు కేటాయించాలి, గతం ప్రభుత్వం 2023-24 లో 6.57 శాతం, 2022బి 23 లో 6.20 శాతం, 2021బి22 లో 6.76 శాతం, 2020-21 లో 6.63 శాతం, 2019-20 లో 6.76 శాతం మాత్రమే కేటాయించారు.ఇది చాలా తక్కువ శాతం అని, గడిచిన 5 సంవత్సరాలలో విద్య రంగానికి కేటాయించిన రాష్ట్ర బడ్జెట్ సరాసరి 6.58 శాతం మాత్రమే ఉన్నదని చెప్పారు.ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే కోవలో 7.31 శాతం కేటాయింపులు కేటాయించడం అనేది విద్యా వ్యవస్థని నిర్వీర్యం చేయడమే అని వారు ఆరోపించారు.బడ్జెట్ లో 20 శాతం తగ్గకుండా నిధులు కేటాయించినప్పుడే ప్రమాణాలతో కూడిన సమాన విద్య దిశగా అడుగులు వేయచ్చు అని లేకుండా ఉంటే విద్యావ్యవస్థ నిర్వీర్యం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మల్లరపు పురుషోత్తం, పురం వాసుదేవరావు, జిల్లా కార్యదర్శి దబ్బెడ హనుమాండ్లు , మైలారము తిరుపతి పాల్గొన్నారు.




## ప్రజలకు ఆమోదయోగ్యమైన ప్రజా సంక్షేమ అబివృద్ధి బడ్జెట్

వాయిస్ టుడే న్యూస్, రాజన్న సిరిసిల్ల జిల్లా: ఇది అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యమైన ప్రజా సంక్షేమ అభివృద్ధి బడ్జెట్ అని తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ ప్రజల ఆశయాలకు అనుకూలమైన బడ్జెట్ గా దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొమ్మాటి నరసయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నరసయ్య మాట్లాడుతూ తెలంగాణ 2024 -25 వార్షిక బడ్జెట్ ను 2 ,91,159 కోట్లుగా అసెంబ్లీలో డిప్యూటీ సీఎం ఆర్థిక మంత్రి బట్టి విక్రమార్క బడ్జెట్ ప్రవేశపెట్టి రైతులకు, పేద ప్రజలకు పెద్దపీట వేసినట్లు ఆయన తెలిపారు, 6 గ్యారంటీలకు డోకా లేకుండా ఫండ్ కేటాయించారని వాస్తవాలకు తగ్గట్టు పద్దు ఉందని, సాగునీటి నీటిపారుల శాఖకు 26 వేల కోట్లు సంక్షేమానికి 40 వేల కోట్లు కేటాయించడం పట్ల ఆయన హార్షం వ్యక్తం చేశారు. రుణమాఫీ రైతు భరోసా కు డోకా లేదని 72,659 కోట్లను వ్యవసాయ రంగానికి కేటాయించారని అలాగే ఇందిరమ్మ ఇళ్లపై కూడా రాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసిందని ముఖ్యంగా ఇందిరమ్మ పథకం ద్వారా పేదలకు 5 లక్షల రూపాయల సహాయం ఎస్సీ ఎస్టీలకు ఆరు లక్షలు ఇవ్వనున్నట్లు ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇల్లు కేటాయించారని అన్నారు. భూమిలేని రైతు కూలీలలో మార్పు తీసుకురావడానికి ఏడాదికి 12 వేల రూపాయల ఆర్థిక సాయం అందిస్తామన్నారు, బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు రాష్ట్ర మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్ కు, ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ కు, సిరిసిల్ల శాసనసభ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేకే మహేందర్రెడ్డికి ఎల్లారెడ్డిపేట మండల కాంగ్రెస్ పార్టీ కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్ భాయి, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మర్రి శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు చెన్ని బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారి బాల్ రెడ్డి, గుర్రపు రాములు, గొల్ల కురుమ యాదవ సంఘాల మండల అధ్యక్షులు మెండే శ్రీనివాస్ యాదవ్, సద్ది పద్మారెడ్డి గుర్రపు రాములు, గంట రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.